క్లుప్తంగా

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం


మాట్లాడుతున్న రాచకొండ ప్రభాకర్

నడిగూడెం : మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాచకొండ ప్రభాకర్ ఆదివారం మండల కేంద్రంలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరమని, నో డ్రగ్స్ సేవ్ లైఫ్ అంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌ను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గండమళ్ల అజయ్‌కుమార్, మాజీ వైస్‌ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్, పోలంపల్లి వెంకటేశ్వర్లు, బాణాల నాగరాజు, కాసాని శివకృష్ణ, గుండు విజయరామారావు, గుండు నాగేశ్వరరావు, కాసాని పుల్లయ్య పాల్గొన్నారు.

వైద్య చికిత్సకు కాంగ్రెస్ చేయూత


ఆర్థిక చేయూత అందిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : పట్టణానికి చెందిన వేముల రవికి ఇటీవల అనారోగ్యంతో బ్రేయిన్ డెడ్ అయ్యాడు. దీంతో అతడి వైద్యచికిత్స కోసం పట్టణ, మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రూ.40వేలతో పాటు 50కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ జితేందర్‌రెడ్డి, రణపంగ నాగయ్య, నాయకులు మల్యాద్రి, కొణతం రాంరెడ్డి, చింతమళ్ల సైదులు, మచ్చ శ్రీను, రమావత్ పాండు, నాగరాజు, శ్రీను తదితరులున్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి


కలకోవలో దిమ్మె నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాగరాజు

మునగాల : జూలై 7న నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవానికి మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకొట్ల నాగరాజు పిలుపునిచ్చారు. గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ దిమ్మెలను ఏర్పాటు చేయాలనే నిర్ణయంలో భాగంగా ఆదివారం మండలంలోని కలకోవలో నూతనంగా ఏర్పాటు చేసే జెండా దిమ్మె శంకుస్థాపనలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు పాతకొట్ల బాలయ్య, మాజీ సర్పంచ్ చిర్రా శ్రీనివాస్, నాయకులు కుడుముల వీరయ్య, మాతంగి ఏసుబాబు, చిర్రా అంజయ్య, మంద రాజేష్, పాతకొట్ల సురేష్, వెంకటేశ్వర్లు, వీరబాబు, గోవర్ధన్, వంశీ, గిరి, ఉప్పలయ్య, వివేక్ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు పరామర్శ

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన పోత బత్తిని శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తన కాలును కోల్పోయి ఇంటి వద్దే ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక వీవీహెచ్‌లో 1988లో హెచ్‌ఎంగా పనిచేసి రిటైర్డ్ అయిన బ్రదర్ జోసెఫ్‌దానియేలు వరంగల్‌లోని ఖాజీపేట నుంచి ఆదివారం వచ్చి శ్రీనివాస్‌ను ఆయన స్వగృహంలో పరామర్శించారు. చిన్ననాటి గురువు తాను పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని వచ్చి గుండె ధైర్యం చెప్పడంతో శ్రీనివాస్‌తో పాటు తల్లి అచ్చమ్మ, భార్య అరుణ భావోద్వేగానికి గురయ్యారు.

చెన్నకేశవ పాల సొసైటీ చైర్మన్‌గా వీరబాబు


వీరబాబు

చిలుకూరు : మండల కేంద్రంలో చెన్నకేశవ పాల ఉత్పత్తిదారుల సహాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా సోమగాని వీరబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సంఘంలో జరిగిన సమావేశంలో నూతన చైర్మన్‌తో పాటు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. నూతన డైరెక్టర్లుగా బెల్లంకొండ భుజంగరావు, గుండు వెంకటమ్మ, మల్లెపంగు శ్రీను, కాసాని రమేష్, కైలాసపు సైదులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు హుస్సేన్, సంఘం మాజీ చైర్మన్లు పిల్లుట్ల కనకయ్య, కొండా లక్ష్మయ్య, సంఘం కార్యదర్శి బాడిసె గురవయ్య, పాలకవర్గం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు పనులకు మోక్షమెప్పుడో

- చెన్నారిగూడెం – గణపారం రోడ్డుకు రూ.కోటి 50లక్షలు మంజూరు
- నిధులు మంజూరై 6నెలలు గడిచినా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న ఆయా గ్రామాల ప్రజలు


గుంతలమయంగా ఉన్న చెన్నారిగూడెం పరిధిలోని రోడ్డు


అధ్వానంగా ఉన్న సాగర్ ప్రధాన కాల్వ నుంచి వెళ్లే రోడ్డు

చిలుకూరు : అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలం పరిధిలోని చెన్నారిగూడెం నుంచి గణపారం వెళ్లే మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆ నిధులు మంజూరు చేసి ఆరు నెలలు గడుస్తున్నా నేటి వరకు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. మండల పరిధిలోని చెన్నారిగూడెం నుంచి సాగర్ ప్రధాన కాల్వ మీదుగా మునగాల మండలంలోని గణపారం వరకు 3కిలోమీటర్ల మేర మట్టి రోడ్డును బీటీరోడ్డుగా నిర్మాణం చేసేందుకు పంచాయతీరాజ్ నిధుల నుంచి రూ.కోటి 50లక్షలు మంజూరు చేసింది ప్రభుత్వం. ఈ నిధులతో 33అడుగుల రోడ్డు వెడల్పుతో బీటీ వేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఈ రోడ్డు నిర్మాణ పనులు నేటి వరకు సదరు కాంట్రాక్టర్ ప్రారంభించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు మొత్తం గుంతలమయంగా మారి అధ్వానంగా ఉంది. ఈ రోడ్డు వెంట చిలుకూరు మండల పరిధిలోని చెన్నారిగూడెం, ఆచార్యులగూడెం, మునగాల మండల గణపారంకు చెందిన సుమారుగా 300 మందికి పైగా రైతుల పొలాలు ఉన్నాయి. వర్షం వచ్చిందంటే ఈ రోడ్డులో రైతులు పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. రైతుల ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఇప్పుడు పనులు ప్రారంభించకపోతే వానాకాలం వరి సీజన్ ప్రారంభిస్తే పనులు చేయడం చాలా కష్టం అవుతుంది. ఈ నెల రోజుల్లో మట్టి, మెటల్ వరకు పనులు పూర్తియితే బీటీ వేయడం సులువుగా ఉంటుందని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

3నియోజకవర్గాలు.. నాలుగు మండలాలను కలిపే రోడ్డు..

ఈ రోడ్డు నిర్మాణం పూర్తియితే జిల్లాలో ఉన్న మూడు నియోజకవర్గాలను, నాలుగు మండలాలకు వెళ్లేందుకు దగ్గర దారి అవుతుంది. కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారిపై హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని హుజూర్‌నగర్ మండలం కట్టవారిగూడెం మీదుగా (రంగుల వంతెన మీదుగా) చిలుకూరు మండల పరిధిలోని జెర్రిపోతులగూడెం, ఆచార్యులగూడెం మీదుగా చెన్నారిగూడెం గ్రామం నుంచి సాగర్ ప్రధాన కాల్వ మీదుగా మునగాల మండల గణపారం నుంచి పెన్‌పహాడ్ మండలం తంగెళ్లగూడెం, చీదెళ్ల, చెట్టముకుందాపురం మీదుగా దూపాడు వరకు కలుస్తుంది. కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారి నుంచి దురాజ్‌పల్లి వద్ద సూర్యాపేట రోడ్డు కలుస్తుంది. మధ్యలో చెన్నారిగూడెం నుంచి గణపారం వరకు పూర్తియితే ఈ రోడ్డు చాలా మంది వాహనదారులకు, రైతులకు మేలు జరుగుతుంది. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణ పనులు జరిగేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించాలి



చెన్నారిగూడెం నుంచి గణపారం వెళ్లే రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయినా సంబంధింత కాంట్రాక్టర్ నేటి వరకు పనులు ప్రారంభించ లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు ప్రారంభించి పూర్తి చేయాలి. ప్రస్తుతం రోడ్డు అధ్వానంగా ఉండి ప్రయాణించడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

– మండవ సైదులు, రైతు, చిలుకూరు మండలం

పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తా

- ఎమ్మెల్యే పద్మావతి


సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ : కోదాడ పట్టణ సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని రాబోయే రోజుల్లో పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పిస్తామని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని ఉత్తమ్ పద్మావతినగర్‌లో రూ.6లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా మున్సిపల్ పార్కులను పరిశీలించారు. పార్కులో వసతులను మెరుగుపరుస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, బాల్‌రెడ్డి, రహీం, సత్యనారాయణ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నిజాముద్దీన్ మృతి కాంగ్రెస్‌కు తీరనిలోటు


నిజాముద్దీన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నిజాముద్దీన్ అకాల మరణం పార్టీకి తీరనిలోటని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రామంలో ఆయన మృతదేహంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మంత్రి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిరకాల మిత్రుడు నిజాముద్దీన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఒక మూల స్తంభంగా నిలిచిన వ్యక్తి అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరచడానికి, కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. అంతకు ముందు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి నిజాముద్దీన్ మృతదేహం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా వివిధ పార్టీల నాయకులు, పులువురు ప్రముఖులు నిజాముద్దీన్ మరణం పట్ల సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ రాధిక అరుణ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, నాయకులు కోతి సంపత్‌రెడ్డి, దొంగరి వెంకటేశ్వర్లు, ఈడ్పుగంటి సుబ్బారావు, చక్కర వీరారెడ్డి, శివరామ్‌యాదవ్, హరిబాబు, మంజూనాయక్, అజీజ్‌పాషా, జక్కుల మల్లయ్య, కోడి ఉపేందర్, ఆదెర్ల శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పాపన్నగౌడ్ జీవితం నేటి తరానికి ఆదర్శం


మాట్లాడుతున్న సీఐ చరమందరాజు

గరిడేపల్లి : తొలి బహుజన పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం నేటి తరానికి ఆదర్శమని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాచరికపు వ్యవస్థలో జమిందారు జాగిర్దర్ ఆగడాలను సహించలేక కడుపు మండి కత్తిపట్టిన సామాన్యుడు బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన యోధుడు పాపన్నగౌడ్ అని కొనియాడారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబును పరిగెత్తించి గోల్కొండ ఖిల్లాను ఏడు నెలలు పాలించిన సాహస వీరుడు సర్వాయి పాపన్న అన్నారు. నేటి యువత పట్టుదలతో కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధించదచ్చని పాపన్న జీవితం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పాపన్న విగ్రహం ఏర్పాటుకు పనిచేసిన యువకులను అభినందించారు. యూత్ ఆధ్వర్యంలో సీఐ చరమందరాజు, ఎస్ఐ నరేష్‌లను శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు అనంతు కరుణాకర్‌గౌడ్, బత్తిని ధర్మయ్య, చామకూరి గురుస్వామి, నేలపట్ల వెంకటేశ్వర్లు, అనంతు చంద్రయ్యగౌడ్, అంజి, వీరబాబు, మండవ సైదులు, రాయికింది వెంకన్న, బత్తిని శివ, పోలంపల్లి అంజి, ఉపేందర్, మండవ రవికుమార్, అనంతు భిక్షం, తిరపయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి

మోతె : ప్రస్తుత వానాకాలం సీజన్ ప్రారంభం నుంచి ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం సాగుచేయాలని సామాజిక కార్యకర్త డాక్టర్ మొలుగూరి గోపి అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్నారిగూడెం, ఉర్లుగొండ, రావికుంటతండా, రాముని తండా, కూడలి, బుర్కచర్ల, రావిపహాడ్ గ్రామాల్లో స్వచ్ఛందగా నిర్వహించిన ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతు చైతన్య యాత్రలో పాల్గొని మాట్లాడారు. రోజురోజుకు మన జీవన విధానం మార్చుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాగులో అనేక మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. 60ఏళ్లుగా చేస్తున్న రసాయనిక వ్యవసాయంతో నేలలో భూసారం పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తేనే పండే పంటలు మనకు ఆరోగ్యం ఇస్తుందన్నారు. నేల ఆరోగ్యంగా ఉండాలంటే జీవామృతం వాడాలన్నారు. ప్రస్తుతం వేప గింజలను సేకరించి వాటి కషాయం పిచికారీ చేస్తే నేల ఆరోగ్యం ఉండి భూసారం పెరుగుతుందన్నారు. దీంతో రైతులకు పురుగుల మందుల ఖర్చులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో రైతులు వెంకటరెడ్డి, రామయ్య, ఆదినారాయణ, వెంకన్న, సీతారాములు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మునగాల : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన హమాలీ వర్కర్స్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చే విధంగా లేబర్‌కోడ్‌లను తీసుకురావడం మూలంగా కార్మికులు పోరాడి సాధించుకున్న 29కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్మికులను బానిసలుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా ఎగుమతి, దిగుమతి చేసే హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు లేకపోవడంతో వారు మానసిక వేదనకు గురవుతున్నారని వాపోయారు. సమ్మెలో అన్ని రంగాలలో పనిచేసే కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, ప్రభుత్వ సెక్టార్‌లో పనిచేసే ఉద్యోగ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ బచ్చలకూరి స్వరాజ్యం, హమాలీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు మైసయ్యగౌడ్, మండల నాయకులు అంజయ్య, మురళి, సైదులు, సాలయ్య, జంబయ్య, వీరన్న, జానయ్య, మోహన్, వెంకన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో మట్టికట్టను తొలగించరూ..


నడిగూడెం మండలం సిరిపురం సమీపాన సాగర్ ఎడమకాల్వలో తొలగించని మట్టి

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురం 132 కిలోమీటరు వద్ద గత ఏడాది సెప్టెంబర్‌లో కాల్వ కట్ట తెగి భారీగా గండి పడింది. ఆ గండి పూడ్చివేత పనుల్లో భాగంగా సిరిపురం పాలారం మేజరుకాల్వ వద్ద సాగర్ నీరు కిందకు వెళ్లకుండా కాల్వలో అడ్డుగా ఓ మట్టికట్టను వేశారు. కాల్వలో అడ్డుగా వేసిన మట్టికట్టను నేటి తొలగించలేదు. వచ్చే నెల రెండో వారంలో సాగర్ నీరు విడుదల చేసే అవకాశం ఉంది. కట్ట ఉండడంతో నీరు నిలిచి ప్రమాదం పొంచిఉందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి ఆ మట్టికట్టను తొలగించాలని కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ నేతలపై ఆరోపణలు మానుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్‌ఎస్ నేతలపై అడ్డగోలుగా ఆధారాలు లేకుండా చేస్తున్న ఆరోపణలు మానుకోవాలని, ఓ న్యూస్ ఛానల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గోపాలపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన ఉద్యమ నేత కేసీఆర్ కుటుంబంపై కావాలని ఓ మీడియా దుష్ప్రచారం చేస్తుందన్నారు. ఈ ప్రచారం అంతా సీఎం కనుసన్నల్లోనే నడుస్తున్నట్లుగా తెలంగాణ సమాజం భావిస్తుందన్నారు. జర్నలిజం ముసుగులో కొన్ని ఆంధ్ర మీడియా సంస్థల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరుతో ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్‌గా పిలువబడే మీడియా పట్ల ప్రజలలో నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ చీకూరి రాజారావు, మాజీ సర్పంచ్ అద్దంకి సైదేశ్వరరావు, నాయకులు హుస్సేన్‌మియా, సుందరయ్య, వీరబాబు, ఉపేందర్, వెంకటేశ్వర్లు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికార సాధనలో బీసీలు ముందుండాలి


నాగేశ్వరరావుకు నియామక పత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

హుజూర్‌నగర్ : రాజ్యాధికార సాధనలో బీసీలు ముందుండాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ధూళిపాల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని బీసీ భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య ఉద్యోగాలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు. ఈ బీసీ బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించాలని ఆయన కోరారు. అనంతరం మండలంలోని సంఘం బూరుగడ్డ గ్రామ అధ్యక్షుడిగా యరగాని గురుస్వామి, పట్టణంలోని 14వవార్డు సంఘం అధ్యక్షుడిగా బండి నాగేశ్వరరావు, 22వ వార్డు సంఘం యూత్ అధ్యక్షుడిగా గొల్లగోపు సందీప్ యాదవ్‌ను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు, ఉపాధ్యక్షుడు చేపూరి నరసింహ చారి, నాయకులు పండ్ల హుస్సేన్‌గౌడ్, కడియాల అశోక్, కాసర్ల సతీష్, ఎస్కే అనీఫ్, కొత్తూరి బ్రహ్మచారి, వట్టికూటి శ్రీనివాస్, గంజి శివ, కొట్టు శేఖర్, కర్నే కృష్ణ, వెంకటేశ్వర్లు, వీరబాబు, వాణి, లలిత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారాహి మాత నవరాత్రి ఉత్సవాలు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సూర్యాపేట మండల పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలోని శ్రీ నామేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మ సమేత శ్రీ సరస్వతి దేవి ఆలయంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆదివారం నాలుగవ రోజు ఆలయ ప్రధాన అర్చకుడు మునగలేటి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, అమ్మవారికి అభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు.

అధ్వానంగా రామాపురం చెరువుకట్ట


బురదమయంగా, కంపచెట్లతో మూసుకుపోయిన రామాపురం చెరువుకట్ట

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురం చెరువుకట్ట అధ్వానంగా మారింది. కట్టకు ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో పాటు, కట్ట పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈ కట్ట మీదుగా అనేక మంది ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. రాకపోకలకు సాగించేందుకు ఇబ్బందికరంగా మారింది. అంతే కాకుండా ప్రమాదాలకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి చెరువు కట్టకు మరమ్మతులు చేయించాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న యాకూబ్

గరిడేపల్లి : ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్కె యాకూబ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అప్పిరెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన వ్యవసాయ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు వేల కోట్ల రూపాయలు మాఫీ చేస్తూ కార్మికులను, వ్యవసాయ కూలీలను పట్టించుకోవడం లేదన్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉంటే ప్రజా సమస్యల పరిష్కరించబడతాయని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కులం పేరుతో మతం పేరుతో సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తుందన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామని హామీనిచ్చి 17 నెలలు అవుతున్నా దాని ఊసే లేదన్నారు. కార్యక్రమంలో జిలకర పెంటయ్య, పందిరి వీరారెడ్డి, రేవూరి స్వప్న, నాగవెల్లి కోటమ్మ, రేవూరి లక్ష్మి, చిన్నపంగు కనకయ్య, నాగమణి, దేవకరుణ, పోలేపల్లి ఉసేనమ్మ, ముత్యాలమ్మ, కళ్యాణి, రమణ, అనిల్, తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

సూర్యాపేట : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రీన్ క్లబ్ ట్రస్ట్ చైర్మన్ ముప్పారపు నరేందర్, బీజేపీ నాయకులు సలిగంటి వీరేంద్ర అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో గ్రీన్ క్లబ్ ట్రస్ట్, దశరథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం ఇంటింటికీ తిరిగి గుడ్డ సంచులు పంపిణీ చేశారు. దశరథ మెమోరియల్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్‌వీవీ ప్రసాద్ సహకారంతో ప్రధాన కార్యదర్శి కొరిపల్లి సురేష్ కుమార్ ఉషారాణి దంపతులు గుడ్డ సంచులు పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో రామచందర్ రావు, తిరుమలనగర్ అధ్యక్షుడు బండి పాపిరెడ్డి, రాము యాదవ్, జలేందర్, మల్లయ్య, యాదయ్య పాల్గొన్నారు.

డయేరియా నివారణకు ముందస్తు చర్యలు


మఠంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, వైద్యసిబ్బంది (ఫైల్)


పెదవీడులో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది


బక్కమంతులగూడెంలో సర్వే నిర్వహిస్తూ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

- ఈ నెల 16నుంచి జూలై 31వరకు ఇంటింటి సర్వే
- వైద్యసిబ్బందికి తల్లిదండ్రులు సహకరించాలని సూచన

మఠంపల్లి : దేశ వ్యాప్తంగా 5సంవత్సరాలలోపు పిల్లలు వర్షాకాలం సీజన్‌లో డయేరియాకు గురై ప్రాణాలు కోల్పోతుండడంతో డయేరియా నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టారు. జాతీయ కార్యక్రమంలో భాగంగా మండలంలో ఈ నెల 16నుంచి జూలై 31వరకు వైద్యసిబ్బంది ఇంటింటి (ఐడీసీఎఫ్) సర్వే చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 16న మండల అధికారులు, వైద్యసిబ్బంది మండల కేంద్రంలో ×ఉధృత అతిసారా నియంత్రణ×(ఐడీసీఎఫ్) వారోత్సవాలను ప్రారంభించారు. మండలంలోని 29గ్రామపంచాయతీల పరిధిలోని 42ఆవాస గ్రామాలలో 5సంవత్సరాలలోపు పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ఇంటింటి సర్వే చేపడుతున్నారు. మండల వ్యాప్తంగా 39మంది ఆశా వలంటీర్లు, మరో 14మంది ఏఎన్‌ఎంలు ఈ సర్వేలో పాల్గొంటున్నారు. పిల్లలకు అతిసారా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే నమోదు చేసుకోవడంతో పాటు తమ వెంట ఉన్న జింక్ టాబ్లెట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నారు. అంతేగాక పరిస్థితి విషమిస్తే వైద్యశాలకు తరలిస్తున్నారు. దేశ వ్యాప్తంగా శిశు మరణాలు తగ్గించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈకార్యక్రమానికి తల్లిదండ్రులు వైద్యసిబ్బందికి సహకరించి తమ ఆరోగ్యలక్షణాలు సిబ్బందికి చూపించుకోవాలని, తద్వారా చికిత్సలు చేయించుకోవాలని వైద్యాధికారులు కోరుతున్నారు.

జూలై 31వరకు సర్వే చేపడతాం



మండలంలోని అన్ని గ్రామాలలో 5సంవత్సరాలలోపు అతి సారా (డయేరియా)తో సంభవిస్తున్న అకాల శిశు మరణాల రేటు తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాతీయ కార్యక్రమాలలో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టాం. గ్రామాలలో వైద్యసిబ్బంది ఇంటింటికి తిరిగి జూలై 31వరకు సర్వే చేపట్టనున్నారు.

– భూక్యా సుధాకర్‌నాయక్, పీహెచ్‌సీ వైద్యాధికారి మఠంపల్లి